క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆరుగురు బాధితులకు మంజూరైన రూ.2.50లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తుదారుడికి సీఎంఆర్‌ఎఫ్ అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పాండురంగారెడ్డి, ఉప సర్పంచ్ సందీప్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శివప్ప, శివరాజ్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్, రాందేవ్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు

కొందుర్గు: మండల పరిధిలోని సంజీవపురం చింతల్ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలు మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వెంకిర్యాల, లక్ష్మీదేవిపల్లి, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాల రైతులు తమ ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల అలంకరించుకొని ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేశారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో ఎల్కగూడ గ్రామస్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కగూడలో నూతనంగా ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తైన సందర్భంగా స్వామివారికి అభిషేకం, హోమం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

26నుంచి పాదుక ప్రతిష్ఠాపన వార్షికోత్సవం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని కొత్తపల్లి శివరులోని మాణికేశ్వరీ మాత పాదుక ప్రతిష్ఠాపన 18వ వార్షికోత్సవం ఈ నెల 26 నుంచి 29వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి హరిశంకర్, కోశాధికారి ప్రభు, గౌరవ సభ్యులు లింగారెడ్డి, నర్సింహులు, మాణిక్య, హన్మంత్‌రెడ్డి, సలహాదారులు వెంకటేశ్, సభ్యులు భూషణం, ఆనందం, నర్సింలుగౌడ్, విశ్వంచారి, రాంచంద్రయ్య, సంఘమేశ్వర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

శేఖర్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని గురుస్వామి శేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం శివ స్వాములు శ్రీశైలం క్షేత్రానికి చేరుకొని మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ... మండల పరిధిలోని చిన్న సోలీపేట్ గ్రామానికి చెందిన 23 మంది శివల మాలధారణ స్వాములు ఐదు రోజుల పాటు 204 కిలోమీటర్లు పాదయాత్రగా శ్రీశైలం చేరుకున్నామన్నారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

మణికొండ: నార్సింగి రక్తమైసమ్మ దేవాలయం సమీపంలో ఈనెల 5వ తేదీన దారి దోపిడీ కేసులో కరణ్‌సింగ్‌తో పాటు దాడిలో పాల్గొన్న సిద్ధార్థ్(చింటూ)ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్సింగి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. అతనిపై రాజేంద్రనగర్, చందానగర్ పోలీస్‌స్టేషన్‌లలో ఐదు కేసులు ఉన్నాయన్నారు. అతని వద్ద ఓ కత్తి, రూ. 2వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంధత్వ నివారణకు ‘కంటి వెలుగు’

- రేపటి నుంచి ప్రారంభం
- నేడు ఎంపిక చేసిన గ్రామాల్లో ట్రయల్ రన్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

షాబాద్: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, కంటి సమస్యతో బాధపడుతున్న వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకం మొదటి విడతకు విశేష స్పందన లభించింది. ఆ సమయంలో అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్రచికిత్సలు చేశారు. మొదటి విడత సక్సెస్ కావడంతో జనవరి 19 నుంచి రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది రెండో విడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 50,230 మందికి కంటి పరీక్షలు నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

పీహెచ్‌సీల వారిగా సమాచార సేకరణ

2018 ఆగస్టు 15న తొలివిడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. 2019 ఫిబ్రవరి వరకు నిర్ణీత సమయాల్లో అన్ని గ్రామాల్లో కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపాన్ని బట్టి దగ్గర, దూరపు చూపు ఉన్నవారిని గుర్తించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేశారు. జిల్లాలో 8,25,576 మందికి పరీక్షలు చేయగా 3,21,767 మందికి కంటి అద్దాలను అందజేశారు. 58,230 మందిని శస్త్రచికిత్సలకు సిఫారసు చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీల వారీగా ఎంత మందికి పరీక్షలు చేయాలనే సమాచారాన్ని వైద్య సిబ్బంది ఇప్పటికే సేకరించింది.

పేదలకు ఊరట

జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. చదువుకునే విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు అందరికీ కంటి పరీక్షలు చేయనున్నారు. సెల్‌ఫోన్ వాడకం విపరీతంగా పెరగడం. టీవీలు, కంప్యూటర్లు చూసే వారి సంఖ్య పెరగడంతో కంటి సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది దీనికి తోడు కంటిపై అవగాహన లేక పల్లె ప్రజలు నేత్ర సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇలాంటి తరుణంలో పేద, మధ్య తరగతి వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వమే కంటి పరీక్షలు చేయనుండటంతో వీరికి ఊరట కలగనుంది. దీని కోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయనున్నారు.

రెండు టీంల ఏర్పాటు



మండల పరిధిలోని 41 గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. రెండు టీంలో వైద్యాధికారి, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశ వర్కర్లు, ఒక హెల్త్ సూపర్‌వైజర్‌ను నియమించాం. వందరోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. మండలంలో ఉన్న వైద్య సిబ్బందితోపాటు మిగతా వైద్య సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతోంది.

– డాక్టర్ వరలక్ష్మి, పీహెచ్‌సీ, చందనవెళ్లి

అ‘పూర్వ’ సమ్మేళనం

కొందుర్గు: చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. పాఠశాలలో 2012–13 విద్యా సంవత్సరంలో పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకుని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కిష్టారెడ్డి, విశ్రాంత ఎంఈఓ సంగయ్య, విశ్రాంత జీహెచ్‌ఎం రఘు, అప్పటి ఉపాధ్యాయులు భాస్కరయోగి, విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, శకుంతల, మహ్మద్ అలీ, నర్సింలు, సునిత, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



2012-13బ్యాచ్ చౌదరిగూడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు

సినిమాకు వెళ్లి వచ్చే సరికి ..

మైలార్‌దేవ్‌పల్లి: సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఎగ్జిబిషన్‌కు వెళ్లి సినిమా చూసి వచ్చే వరకు ఇంట్లో దొంగలు పడి నగదుతో పాటు నగలు దోచుకెళ్లిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడలో తిరుమలేష్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు నాంపల్లి ఎగ్జిబిషన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అత్తాపూర్‌లో థియేటర్‌లో సినిమా చూసిరాత్రి 12 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నారు. గేటు తాళం పగిలి ఉండడంతో అనుమానం వచ్చిన తిరుమలేష్ ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి చూడగా మూడున్నర తులాల బంగారంతో పాటు వెండి ఆభరణాలు, రూ. 1.50 లక్షల నగదు కనిపించలేదు. ఈ మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీ రోజు 300మందికి పరీక్షలు



షాద్‌నగర్: సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

షాద్‌నగర్: కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతీ రోజు 300మందికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహిస్తారని ఆర్డీఓ రాజేశ్వరి చెప్పారు. మంగళవారం ఆమె లింగారెడ్డిగూడ గ్రామంలోని ఆర్డీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజవయంతం చేయాలన్నారు. శిబిరాలకు వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. విధి నిర్వాహణలో అధికారులు అలసత్వం వహించొద్దు అన్నారు. ఈ సమావేశంలో మాస్‌మీడియా జిల్లా అధికారి నరహరి, ఏసీపీ కుషాల్కర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, ఎంపీడీఓలు వినయ్‌కుమార్, శరత్‌బాబు, సీడీపీఓ నాగమణి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి

చేవెళ్ల: అధికారులు సమన్వయంతో పనిచేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేవెళ్ల ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. మంగళవారం ఆయన చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమానికి బుధవారం ఎంపిక చేసిన గ్రామాల్లో ట్రయల్ రన్ నిర్వహించాలన్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ మండలాల పరిధిలోని పీహెచ్‌సీల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు కేంద్రాల వద్ద నుంచి సమాచారం అందించాలని చెప్పారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్‌నగర్: కొండన్నగూడలో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బాలాజీ ఫ్యాక్టరీ నుంచి జేపీ దర్గా వయా కొండన్నగూడ రోడ్డుకు రూ.3కోట్లు, మధురాపూర్ నుంచి బూర్గులకు రూ.1.15కోట్లు, బూర్గుల నుంచి పోతురాజుగడ్డ తండాకు రూ.59లక్షలు, మధురాపూర్ నుంచి కమ్మదనంకు రూ.55లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి శేరిగూడకు రూ.60లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బూర్గుల వయా చిల్కమర్రి రోడ్డుకు రూ.4.15కోట్లు మరమ్మతులకు మంజూరయ్యాయి. ఈ పనులను మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా నూతన బీటీ రోడ్లు, బీటీ రోడ్ల మరమ్మతులకు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాంరెడ్డి, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, వైస్ ఎంపీపీ మౌనిక, హరికృష్ణ, చిల్కమర్రి రవీందర్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.70లక్షలు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.70లక్షలు మంజూరయ్యాయని వైస్ ఎంపీపీ రాజేశ్‌పటేల్ తెలిపారు. నిధుల విడుదల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కొందుర్గు గ్రామస్తులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానయ్య, గోపాల్, సుందర్, నర్సింలుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కృష్ణయ్య గౌడ్, శ్రీను, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి



మైలార్‌దేవ్‌పల్లి: స్థానికంగా భిక్షాటన చేసే వృద్ధుడు మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడ మెఫిల్ హోటల్ ప్రాంతంలో స్థానికంగా భిక్షాటన చేసే వృద్ధుడు(70) పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. స్థానికంగా భిక్షాటన చేస్తూ రోడ్డుపై జీవిస్తుంటాడని స్థానికులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

శంషాబాద్ : యువతి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దేవ్‌రాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని వెకాంకనీ కాలనీలో నివాసముండే సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగి అమర్‌నాథ్ పన్నెండేళ్లుగా కె. దివ్య (18) దత్తత తీసుకున్నాడు. ఈ నెల 15వ తేదీ ఇంట్లో ఎవరికి చెప్పకుండా దివ్య బయటికి వెళ్లింది. తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్య మానసిక పరిస్థితి సరిగా లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పద్మశాలిపురంలో వృద్ధుడు..



బాషుమియా(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మశాలిపురం ప్రాంతానికి చెందిన భాషుమియా(75) తన కుమారుడి కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 14వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులు ఫిర్యాదు చేశారు. కాగా భాషుమియాకు మతిస్థిమితం లేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయాలను మరవొద్దు

బీజేపీ నియోజకవర్గ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి



పూజలో పాల్గొన్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: యువత సంస్కృతిని, సంప్రదాయాలను మరవొద్దని బీజేపీ నియోజకవర్గ పాలక్ జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి శివారులోని శివాలయంలో బీజేపీ నేత అంజయ్య శివ మాలధారణ స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిట్టా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని సూచించారు. సేవా గుణాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, దేపల్లి అశోక్‌గౌడ్, పాతపల్లి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ధ్వజారోహణం



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

చేవెళ్ల: మండలకేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం జాతర పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అఖండదీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శేషవాహన సేవ చేపట్టారు. ప్రతీ సంవత్సరం శివరాత్రికి నెల రోజుల ముందుగా ఆలయంలో రథోత్సవ జాతర ప్రారంభిస్తున్నట్లు ఆలయ అర్చకులు శ్రీకాంత్, శ్రీపాద్ తెలిపారు. మంగళవారం ప్రాంరభమైన ఈ పూజలు ఈ నెల 21వరకు కొనసాగుతయన్నారు. ఈనెల 21న రథోత్సవం ఘనంగా నర్వహిస్తామన్నారు. 18న గజవాహన సేవ, 19న అన్నదాన కార్యక్రమం, హన్మంత వాహన సేవ, 20న గరుడవాహన సేవ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. మహాశివరాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగుతుంటాయని తెలిపారు.

తెచ్చుకున్న తెలంగాణలో అన్యాయం



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చిత్రంలో నర్సింహారెడ్డి తదితరులు

బండ్లగూడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. బండ్లగూడలోని జీఆర్‌కే గార్డెన్‌లో కార్పొరేషన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి అధ్యక్షతన మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ బంగారు తెలంగాణను కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం తెచ్చుకున్న తెలంగాణలో డబుల్ ఇళ్లు లేవు.. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి కూ డా నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేను పుట్టిన గడ్డపై నాకు అవకాశం కల్పిస్తే రాజేంద్రనగర్‌ని ఉన్నత నియోజకవర్గంగా మారుస్తానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి షాబుద్దీన్, ఏ బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్, బీబ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, నాయకులు సంజయ్ యాదవ్, శేఖర్‌యాదవ్, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బతుకులు బాగు

రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: రాజ్యాధికారంతోనే రజకుల బతుకులు బాగుపడతాయని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో రజకసంఘం మండలాధ్యక్షుడు కల్వకోలు యాదగిరి ఆధ్వర్యంలో గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దశరథం, ఉపాధ్యక్షుడిగా సాయిలు, ప్రధాన కార్యదర్శిగా భిక్షపతి, కోశాధికారిగా చెన్నయ్య, ప్రచార కార్యదర్శిగా శ్రీను, సలహాదారులుగా జంగయ్య, అంజయ్య, వెంకటయ్యతో పాటు మరో 10మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కృష్ణ, మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ విజేతలకు అభినందన



విద్యార్థులతో సీబీఐటీ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి

మణికొండ: ఇన్వెస్కో హాక్ 2హైర్– 2023 హ్యాకథాన్ పోటీలో మొదటి బహుమతి సాధించిన విద్యార్థులను చైతన్యభారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మంగళవారం అభినందించారు. కళాశాలలో కెమికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు యోగేష్, యష్‌రాజ్, మెకానికల్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు హిమాన్షు, సాయి వంశీ, ఐటీ ఫైనల్ ఇయర్ విద్యార్థి సాత్విక్‌లు హాకథాన్‌లో పాల్గొన్నారు. బ్లూప్రింట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజైన్ సమస్యను పరిష్కరించారు. రూ. 50వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ మేరకు వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో సీబీఐటీ కెరీర్, ప్లేస్‌మెంట్ సలహాదారుడు డాక్టర్ ఎస్ఎల్ఎస్ రెడ్డి, ప్రొఫెసర్ ఎం. ముకుందవాణి, అధ్యాపకులు డాక్టర్ ఎం. మల్లయ్య, పీవీఆర్ రవీందర్‌రెడ్డి, కె.రాధిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో మన ఊరు–మన బడి పథకం కింద స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ.70.92 లక్షలతో అభివృద్ధి పనులకు, రూ.20 లక్షలతో నూతన పంచాయతీ భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13.89 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో పాటు నియోజకవర్గంలోని 44 నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. కడ్తాల్ మండలంలో 9 గ్రామ పంచాయతీ భవనాలకు, కల్వకుర్తి మండలంలో 7, వెల్దండకి 7, చారకొండకి 2, ఆమనగల్లుకి 2, తలకొండపల్లికి 8, మాడ్గుల్ మండలంలో 9 గ్రామాల్లో జీపీ భవనాల నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.20 లక్షల చొప్పున నిధులు విడదలయ్యాయన్నారు. మున్సిపాలిటీలో బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో పల్లె దవఖానాలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాడ్గుల్ మండలానికి 7, తలకొండపల్లి మండలంలో 6, ఆమనగల్లు మున్సిపాలిటీలో 2 బస్తీ, 1 పల్లె దవాఖానా, కడ్తాల్ మండలంలో రావిచేడ్, ముద్వీన్, చరికొండ, చల్లంపల్లి గ్రామాలకు 4పల్లె దవాఖానాలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, ఎంపీటీసీ గోపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.